## క్లుప్తంగా

### ఎమ్మెల్యేకు సన్మానం



రాయపర్తి : పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డిని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఘనంగా శాలువాతో సన్మానించారు. ఆయన అమెరికా నుంచి వచ్చిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను హామ్యానాయక్, రవీందర్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ముద్రబోయిన వెంకన్న, సుదర్శన్‌రెడ్డి, కాంచనపల్లి వనజారాణి, ఈరెడ్డి నర్సింహారెడ్డి, చిర్ర మల్లయ్య, బద్దం రంగారెడ్డి, తీగల సాయిలు, మాంజ్యా తదితరులు పాల్గొన్నారు.

### 'యాదవ యూత్' ప్రధాన కార్యదర్శిగా సుమన్



రాయపర్తి : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన మంచాల సుమన్‌ను జాతీయ అధ్యక్షుడు మేకల రాములు నియమించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సుమన్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. యాదవ కులస్తుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని చెప్పారు. యాదవులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పాటు పడతానని చెప్పారు. తనను నియమించిన రాములుకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆటో బోల్తా పడి మహిళకు గాయాలు

వర్ధన్నపేట : మూలమలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఓ మహిళ గాయాలపాలైన ఘటన పట్టణ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన మౌనిక భర్త రాజుతోకలిసి బండౌతపురంలోని బంధువుల ఇంటికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్న క్రమంలో రెడ్డిపాలెం రోడ్డులోని మూలమలుపు వద్ద ఆటో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మౌనికకు గాయాలు కాగా వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

### కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని బాలికల గురుకుల కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటనఖ స్పాట్ అడ్మిషన్ కోసం దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ జయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీసీ ప్రథమ సంవత్సరంలో 10 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 10 తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈనెల 27న చెన్నారావుపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేయాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

**ఎంపీసీలో 8, బైపీసీలో 5..**

పర్వతగిరి : మండల కేంద్రంలోని బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్ ఎంపీసీలో 8, బైపీసీలో 5 సీట్లు ఉన్నట్టు ప్రిన్సిపాల్ అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ కోసం ఈనెల 27న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

### నివాళి



ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ బలుగూరి విజాకర్‌రావు తండ్రి గోపయ్య (81) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ముస్తఫా, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల పక్షాన పోరాడాలి

గూడూరు : ఎన్నికల హామీల అమలు కోసం పోరాడాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న కోరారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నూకల ఉపేందర్‌యాదవ్, బందెల వీరస్వామి, నలీం, ఎడ్లపల్లి రమేష్, మారం నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# ప్రయాణం ప్రమాదకరం

- కల్వర్టులకు రక్షణ గోడలు కరువు
- మలుపుల్లో దట్టంగా పెరిగిన చెట్లు, ముళ్లపొదలు



లింగగిరి-నెక్కొండ దారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు, కల్వర్టు

చెన్నారావుపేట : మండలంలోని పలు రహదారుల్లో ప్రయాణం ప్రమాదకరం అంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు రోడ్లలోని కల్వర్టులకు రక్షణ గోడల్లేవు. అలాగే మలుపుల్లో చెట్లు ఏపుగా పెరిగి ఎదురు వచ్చే వాహనాలు కనిపించని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రజలు, ప్రయాణికులు రాకపోకలు సాగించాలంటే బెంబేలెత్తుతున్నారు. గతేడాది రోడ్డు కింది పైపులు కొట్టుకుపోగా అధికారులు మరమ్మతు కూడా చేయకుండా నిర్లక్ష్యం నీడలో జోగుతున్నారన్న అపవాదు ఉంది. మండలంలోని లింగగిరి క్రాస్ రోడ్డు నుంచి నెక్కొండ రోడ్ క్రాస్ వరకు పలు మూలమలుపుల వద్ద చెట్లు దట్టంగా పెరిగాయి. కల్వర్టులకు రక్షణ గోడలు లేవు. ఈ దారిలో ప్రతిరోజూ స్కూల్ బస్సులు, ఆటోలు, జీపులు, బస్సులు, లారీలు, తదితర వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం రద్దీ ఉంటుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతేడాది ఉధృతంగా ప్రవహించిన వరదకు ఈ రోడ్డు కొట్టుకుపోయి పెద్ద సైజులో గండ్లు పడ్డాయి. అవి నేటికీ అలానే ఉండడం అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. మూలమలుపుల వద్ద ముళ్లకంపలు, చెట్ల పొదలు రోడ్డుకు అల్లుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జల్లి నుంచి సూర్యపేటతండాకు వెళ్లే రోడ్డుపై కల్వర్టులకు, శంకరంతండా నుంచి బాపునగర్ వెళ్లే రోడ్డులోని కల్వర్టుకు రక్షణ గోడలు లేవు. ఆర్ అండ్ బీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇకనైనా వెంటనే కల్వర్టులకు రక్షణ గోడలు ఏర్పాటు చేయించడంతోపాటు మూలమలుపుల్లోని చెట్ల పొదలను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

#### రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి



లింగగిరి క్రాస్ రోడ్డు నుంచి నెక్కొండకు వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. వరద ఉధృతికి రోడ్డుకు కోతలు పడ్డాయి. ప్రమాదాలు జరుగకముందే ప్రభుత్వం, అధికారులు స్పందించాలి. రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి.

-గుగులోతు మోహన్, ప్రయాణికుడు

#### సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రోడ్డు మూలమలుపుల్లో, రక్షణ గోడలు లేని కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం తగ్గుతుంది. మలుపుల్లో దట్టంగా పెరిగిన చెట్లను, తుప్పలను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలి.

-ధారావత్ కల్యాణ్ చక్రవర్తి, వాహనదారుడు

## క్రమశిక్షణతోనే విద్యార్థుల ఉన్నతి

- ఆర్‌డీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పర్వతగిరి : క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నతి సాధించగలరని ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుతపాయ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. మండలంలోని కల్లెడలోని ఆ కళాశాలలో ఆదివారం నిర్వహించిన వెల్‌కమ్ పార్టీలో ఆయన మాట్లాడారు. కొత్తగా చేరిన విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, సీనియర్లు జూనియర్లకు ఆదర్శప్రాయంగా వ్యవహరించాలని సూచించారు. ప్రణాళికాయుతంగా చదివితే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడం సులువని చెప్పారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో పోటీ పెరిగిందన్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థులు పోటీ పడి చదవాలని, విషయ పరిజ్ఞానం పెంచుకునేలా అధ్యయనం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజు, ఏఓ సత్యనారాయణ, సిబ్బంది రాంబాబు, మహేశ్వర్, జయశంకర్, సైదులు, గుంశావళి, శ్రీనివాస్, హైమావతి, ప్రశాంత్, మహేష్ పాల్గొన్నారు.

## పేద 'ముదిరాజ్'లకు అండగా ఉంటాం

- 'మెపా' వ్యవస్థాపక అధ్యక్షుడు దేవేందర్



బాధితురాలికి నగదు అందిస్తున్న దేవేందర్

నర్సంపేట రూరల్ : పేద ముదిరాజ్ కులస్తులకు అండగా ఉంటామని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేటకు చెందిన గొర్రె శారద కుమారులు వినయ్, అజయ్‌లకు చెందిన ఇళ్లు ఇటీవల షార్ట్ సర్క్యూట్‌కు గురై పూర్తి దగ్ధమవగా బాధిత కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం దేవేందర్ ఆధ్వర్యంలో రూ.25 వేల నగదు సాయం అందజేశారు. అలాగే నర్సంపేట మండలంలోని కమ్మపల్లిలో మౌటం సరోజన అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా సరోజన కూతురుకు ముదిరాజ్ కులస్తులు రూ.20,300లు అందించగా అసోసియేషన్ తరఫున రూ.3 వేల సాయం అందజేశారు. దాసరిపల్లికి చెందిన పెండ్యాల సారయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని దేవేందర్ ఆధ్వర్యంలో పరామర్శించారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, వాణిజ్య, ఇతర అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కులస్తులకు సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పేదలను ఆదుకునేందుకు కులస్తులందరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శులు చిరంజీవి, సింగారపు రాకమృష్ణ, నీటి రాజు, రాష్ట్ర నాయకులు బోనాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, నర్సంపేట డివిజన్ గౌరవ అధ్యక్షుడు పిట్టల కుమార్, నాయకులు ఝెలబోయిన రాజు, తిరుపతి, యాట రవికుమార్, దండు రాంనర్సు, పెసరు సుదర్శన్, సాంబయ్య, మారపాక నర్సయ్య, పెండ్యాల భిక్షపతి, సొసైటీ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి పెండ్యాల రవి, తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రాష్ట్ర కమిటీ సమావేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న వర్షన్

నర్సంపేట : సిద్దిపేటలో రేపటి (ఈనెల 27) నుంచి రెండ్రోజులపాటు యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్టు జిల్లా కన్వీనర్ సమ్మెట వర్షన్ తెలిపారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లు, కొందరు ఉన్నతాధికారులు కుమ్మక్కై విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుండా అవినీతికి పాల్పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించకుండా, కాస్మొటిక్ చార్జీలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు ఎప్పటికప్పుడు పెంచి చెల్లించేలా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు దోమ తెరలు అందించాలని, ఏఎన్ఎంలను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి దశల వారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశానికి విజయవంతం చేయాలని విద్యార్థులను కోరారు. సమావేశంలో నాయకులు రాజేష్, శివమణి, వీరేందర్, బాలకృష్ణ, మహేష్, రమణ, రవి, శోభన్, సతీష్ పాల్గొన్నారు.

## 'యూత్' మండల అధ్యక్షుడిగా గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న హరీష్

చెన్నారావుపేట : యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిగా బరిలో నిలిచిన బండి హరీష్ కోరారు. మండలంలోని తిమ్మరాయినిపహాడ్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సభ్యులకు ఐవైసీ ఆఫ్ మెంబర్‌షిప్‌పై ఆయన వివరించారు. మండలంలో ఎన్నికల విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. మండలంలోని యువతకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని చెప్పారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బలపర్చిన తనకు ఓటు హక్కు వినియోగించుకుని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ మాట్లాడుతూ 35 ఏళ్లలోపు వయస్సున్న యువత ఆన్‌లైన్‌లో 4వ నంబర్‌పై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేష్, మాజీ జెడ్పీటీసీ బాల జోజి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జయరాజ్, నాయకులు అర్జయ్య, మంద నరేష్, రషీద్, సతీష్, విజయ్, నరేష్, భూక్య రాజు, సతీష్, ప్రవీణ్, భానుచందర్, అనిల్ పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్



### రోడ్డు నడుమ గుంత

మండలంలోని రాయపర్తి నుంచి పెర్కవేడు వెళ్లే దారిలోని రోడ్డు నడుమ గుంత పడగా ఎవరూ పట్టించుకోకపోతుండడంతో వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆ రోడ్డు మీదుగా పెర్కవేడు, అన్నారం, మహబూబ్‌నగర్, రాగన్నగూడెం, కొండాపురం, కొత్తూరు, సూర్యతండ, ఏకేతండా తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడం పరిపాటి. గుంతలో వాహనాలు పడుతూ పలువురు గాయాల పాలవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ముళ్లకంప వేశారు. ఇకనైనా అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతు చేయాలని జనం డిమాండ్ చేస్తున్నారు. -రాయపర్తి

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
వల్లె వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9502078283

### మహిళలకు చీరల పంపిణీ



గీసుకొండ : ధర్మారంలో సీపీఐ నాయకురాలు తోట చంద్రకళ ఆమె కుమారుడు సతీష్ జ్ఞాపకార్థం మహిళలకు ఆదివారం చీరెలు, టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సతీష్ మృతి చెంది ఏడాది గడచిన నేపథ్యంలో పేద మహిళలకు 220 చీరెలు, టిఫిన్ బాక్సులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరగోని శంకరయ్య, రత్నాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ, తదితరులు పాల్గొన్నారు.

### చెక్కు అందజేత

తొర్రూరు రూరల్ : మండలంలోని వెలికట్టెకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బందు మహేందర్ (35) గతంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందగా అతడి భార్య సరస్వతికి ఆ పార్టీ నాయకుడు, మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్ గురువారం రూ.2 లక్షల బీమా చెక్కు ఆదివారం అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

## నాగేశ్వర్‌రావుకు డాక్టరేట్

ఐనవోలు : ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి అద్దంకి నాగేశ్వర్‌రావుకు తెలంగాణ సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన దైవాజ్ఞ శర్మ డాక్టరేట్ బిరుదును ప్రదానం చేశారు. ఆధ్యాత్మిక సేవా రంగంలో విశేష సేవచేస్తున్నందుకు నాగేశ్వర్‌రావును సత్కరించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచవరం గౌరిశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాల్లో ట్రస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ తనకు డాక్టరేట్ బిరుదును ప్రదానం చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక రంగంలో మరింత సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

## ప్రజాచైతన్యమే 'మన్‌కీ బాత్' ధ్యేయం



'మన్‌కీ బాత్'ను వీక్షిస్తున్న కొండేటి శ్రీధర్

వర్ధన్నపేట : ప్రజలను చైతన్యవంతం చేయడమే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం నిర్వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. పట్టణంలో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం ఆయన వీక్షించి మాట్లాడారు. ప్రతినెలా చివరి ఆదివారం రోజుల్లో భారత దేశ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలతోపాటు వివిధ రాష్ట్రాల్లో, రంగాల్లో పలువురు సాధించిన విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నట్టు తెలిపారు. దేశం అభివృద్ధిలో సాధించిన ఘనత, తదితర అంశాలను ప్రధాని ఎప్పటికప్పుడు ప్రజలతో పంచుకుంటూ మనసులోని మాటలను వినిపిస్తూ చైతన్యవంతం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం, నాయకులు పెద్దూరి రాజుకుమార్, ఐత రవి, గిరిప్రసాద్, మల్లెపాక అనిల్ పాల్గొన్నారు.

## పాపన్న స్ఫూర్తితో ఉద్యమించాలి



పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : సర్వాయి పాపన్న స్ఫూర్తితో బహుజనులు రాజ్యాధికార దిశగా ఉద్యమించాలని తెలంగాణ ఉద్యమకారుడు, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ చైర్మన్, ప్రొఫెసర్ డాక్టర్ కత్తి వెంకటస్వామి గౌడ్ కోరారు. పట్టణంలోని పాకాల సెంటర్‌లో పాపన్న 373వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాపన్న విగ్రహ కమిటీ అధ్యక్షుడు సోల్తి సారయ్య, గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ అధ్యక్షత వహించగా తొలుత సర్వాపురంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్, ఆర్డీఓ కార్యాలయం, ఎమ్మెల్యే కార్యాలయం మీదుగా బస్టాండ్, అంగన్‌డి, అంబేడ్కర్ సెంటర్ నుంచి పాకాల సెంటర్ వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. తదనంతరం పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడారు. జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ బహుజనులు అన్ని రంగాల్లో వెనుకబాటుతనానికి గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కులగణన జరగకుండా కొన్ని దుష్టశక్తులు అడ్డుకుంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. తక్కువ శాతమున్న ఆధిపత్య వర్గాలు రాజ్యమేలుతుండగా బహుజనులు ఓటు బ్యాంకుగా మాత్రమే గుర్తించబడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తుందన్నారు. మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు ఐక్యతతో హక్కులు సాధించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాతీయ సెక్రెటరీ జనరల్ రాగుల సిద్ధిరాములు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజు, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాగుల కిరణ్‌కుమార్, వరంగల్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు గోపగాని వెంకట్, కొండగొని రవి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గొడిశాల సదానందం, రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య రక్షణే వైద్యశిబిరాల ధ్యేయం



వైద్యం అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

వర్ధన్నపేట : ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు బాల వికాస ఏరియా కోఆర్డినేటర్ పిట్టల రాణి తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కట్ర్యాలలో హనుమకొండకు చెందిన శ్రీలక్ష్మీనర్సింహ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న పరిస్థితి నెలకొందని చెప్పారు. సమాజంలోని ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తూ రోగాల నుంచి కాపాడుకోవాలని సూచించారు. మురుగునీరు నిలవకుండా చూడాలని చెప్పారు. జ్వరం, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వైద్యశిబిరాలను పేదలు వినియోగించుకోవాలని తెలిపారు. శిబిరంలో సుమారు 150 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు నిఖిత, ఆస్పత్రి పీఆర్‌ఓ సుభాష్, పాషా, సిస్టర్లు ప్రసన్న, కృష్ణవేణి, బాలవికాస ప్రతినిధులు ఫాతిమా, అనురాధ, చందన పాల్గొన్నారు.

## 'శ్రీధర్‌శర్మ బహిరంగ క్షమాపణ చెప్పాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాథస్వామి

నర్సంపేట : చాత్తాద కులస్తులను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన శ్రీధర్‌శర్మ బహిరంగ క్షమాపణ చెప్పాలని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడు దాస్యం రంగనాథస్వామి, రాష్ట్ర అర్చక మండలి కార్యదర్శి తాడూరు వెంకటేశ్వరస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాల వారీగా అర్చక పురోహితులు, కార్యకర్తలు శ్రీధర్‌శర్మ వ్యాఖ్యలను ఖండించాలని కోరారు. వరంగల్ జిల్లాలో ఐదేళ్ల క్రితం ఓ ఆలయంలో బ్రాహ్మణ పురోహితులు పూజలు చేస్తుంటే పక్కనే ఉన్న మసీదు నుంచి గంట శబ్దం వచ్చినందుకు అసౌకర్యంగా భావించి ఆ బ్రాహ్మణుడిపై దాడి చేయగా బ్రాహ్మణుడు మృతి చెందగా రాష్ట్రంలో అర్చక పురోహితులు ధర్నా చేశారని గుర్తు చేశారు. అందులో బ్రాహ్మణ శ్రీవైష్ణవ, చాతాద శ్రీవైష్ణవ, జంగమ, విశ్వకర్మ కుల పూజారులు కలిసికట్టుగా వేల సంఖ్యలో ధర్నా చేసి అరెస్టు అయిన సందర్భాలున్నాయని తెలిపారు. చాతాద పురోహితులకు దానం ఇస్తే పుణ్యం రాదని బ్రాహ్మణులు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో చాతాల కులస్తులు భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రవికుమార్, సత్యం, వరంగల్ గోవిందరాజుల గుట్ట అర్చకులు మురళికృష్ణ, వరయోగుల లక్ష్మణస్వామి, రాజుస్వామి, ఖమ్మం బాధ్యులు శ్రీనివాస్, సత్యనారాయణస్వామి, జగన్‌స్వామి పాల్గొన్నారు.

### గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

ఖిలా వరంగల్: సెప్టెంబర్ 7 నుంచి జరగనున్న వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేయబోయే గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు మీద ప్రజలు నడిచే దారిలో ఇరుకైనా వీధుల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదని, మండపం వద్ద కనీసం ముగ్గురు వాలంటీర్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని, గణేష్ మండపం వద్ద నిర్వహించే వాలంటీర్ల పేర్లను మండపం వద్ద ఒక పుస్తకంలో నమోదు చేయాలి. మండపాలను గాలి, వానకు కూలిపోకుండా పకడ్బందీగా నిర్మించాలి. డీజేలకు అనుమతి లేదన్నారు. మైక్ కొరకు స్థానిక ఏసీపీ అనుమతి తప్పకుండా తీసుకోవాలని, మండపం వద్ద మద్యపానీయాలు, జూదం లేదా ఆసంఘటిత జరిగినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.